## కొండకల్ తాండ రైతులకు సిపిఎం మద్దతు

**శంకర్‌పల్లి, మార్చి 12, ప్రభాతవార్త:**
తమభూములు తమకు ఇప్పించాలని డిమాండ్‌చేస్తూ కొండకల్ తండావాసులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారంతో 61వరోజుకు చేరుకున్నాయి. రిలేదీక్షలకు సిపిఎంనేతలు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉందా లేక నియంతృత్వ వ్యవస్థ ఉన్నదా అని ప్రశ్నించారు. పేదలు గిరిజనులు తరతరాలుగా సాగుచేసుకుని బతుకుతున్నటువంటి గిరిజనుల భూములు అపర్ణ గ్రీన్ మార్క్ రియల్ ఎస్టేట్ కంపెనీలు, విక్రంరెడ్డి లాంటి భూస్వాములు కబ్జా చేస్తూ ఉంటే ప్రభుత్వ అధికారులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం బాధాకరమన్నారు. అపర్ణ రియల్‌ఎస్టేట్ కంపెనీ 217ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాచేస్తే ఏమీచేయలేని రెవెన్యూ అధికారులు, అదే పేదవాడు 60గజాలకోసం గుడిసెవేస్తే రాత్రికిరాత్రి వందలమంది పోలీసులతోవచ్చి గుడిసెలను తొలగిస్తున్నారన్నారు. పేదవాడికి ఒక న్యాయం ధనవంతులకో న్యాయం ఉంటుందా? కొండకల్‌తాండ గిరిజనులకు న్యాయంచేయకపోతే ఉద్య మాన్ని ఉధృతంచేస్తామని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, కొండకల్ తాండ గిరిజనులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
# వార్త

## వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు

**ఘట్‌కేసర్, మార్చి 12, ప్రభాతవార్త:**
వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజురోజుకు చోరీలు అధికమవుతున్నాయి. ఇంటికి తాళంవేసి బయటకువెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. చోరీని నివారించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్న ప్పటికీ దొంగతనాలుమాత్రం ఆగడంలేదు. ఘట్‌కేసర్‌మున్సిపల్ ఎన్ఎఫ్‌సినగర్, బాలాజీనగర్, మేడపాటి నగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, అవుషాపూర్‌లలో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. తాళంవేసున్న ఇళ్లను లక్ష్యంగాచేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పగలు రెక్కీనిర్వహించి రాత్రిపూట సంచరిస్తూ తాళంవేసి ఉన్న ఇళ్లను కొల్లగొడుతున్నారు. ప్రజలు తమ ఇంటికి తాళంవేసి ఒకరోజు ఇంటికిరాకుండా బంధువుల ఇంటికి, శుభకార్యాలకువెళ్లివచ్చేసరికి ఇల్లుగుల్లవుతున్నదని ఆందోళనచెందుతున్నారు. ఆగంత కులు తాళాలువిరగ్గొట్టి బీరువాల్లోని బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్తున్నారు. రాత్రిపూట పోలీసుపెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని పోలీసులుచెబుతున్నా చోరీలనుమాత్రం అరికట్టలేకపోతున్నారు. ఇతర రాష్ట్రాలనుంచి రైళ్లలో పెద్దసంఖ్యలో వస్తున్నారు. అలా వచ్చిన ఆగంతకులు పలుచోట్ల దొంగ తనాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

# నీటిపారుదలకు నిధుల కటకట

### ఎత్తిపోతలు ఉత్తిమాటే!
### కలగా శివసాగర్ ప్రాజెక్టు
### సద్వినియోగం కాని నదీజలాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**
వికారాబాద్‌జిల్లాలో వర్షాధారిత పంటలే దిక్కుగా మారాయి. ప్రభుత్వాలుమారినా పాలకులుమారినా నీటిపారుదలపై పెద్దగా శ్రద్ధచూపించలేకపో యారు. వైఎస్ హయాంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుద్వారా గోదావరిజలాలు తెస్తామని హామీ లు ఇవ్వగా, అదిసాధ్యంకాదని కృష్ణాజలాలేశరణ్య మని కెసిఆర్‌సర్కార్ చేసినబాసలు గాలిలో కలిసి పోయాయి. కృష్ణాజలాలు తెస్తామంటూ జిల్లారైతు లను పాలమూరు పర్యటనకు తీసుకువెళ్లిన ఎంపి లు, ఎమ్మెల్యేలు ఇప్పటికీ ఒక్క ఎకరాకు నీరందిం చలేకపోయారు. ఈప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుం దోనని రైతులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. అయితే, ఈజిల్లాలో ఉన్న నీటివసతులను సద్విని యోగం చేసుకోవడంలో పాలకులు విఫలమవుతు న్నారు. గతంలో యేర్పాటుచేసిన ఎత్తిపోతల పథ కాల శిథిలాలు, అర్థాంతరంగా ఆగిపోయిన సాగు నీటి ప్రాజెక్టులు పాలకుల పనితీరుకు అద్దంపడు తున్నాయి. లోయర్ కృష్ణాపరిధిలోని బీమా ఉప నదులు కాగ్నా, కాకరవేణి నదీజలాలను సద్విని యోగించాల్సిన అవసరం ఉన్నది. ఈనదులపై మూడున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన ఎత్తి పోతల పథకాలు ప్రస్తుతం ఉనికి కోల్పోయాయి. 1984-85లో కాగ్నానదిపై ఆరు ఎత్తిపోతల పథ కాలు ఏర్పాటుచేశారు. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధిసంస్థ(ఎపిఐడిసి) కొంతకాలంపాటు నిర్వ హణ చేపట్టింది. వీటికింద 4వేల ఎకరాల భూము లను సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నిర్వహణ భారంగామారి కొంతకాలానికే మూడు పథకాలు మూతపడ్డాయి. ధారూరు మండలం దోర్నాల, యాలాలమండలం సంగాయిపల్లితండా, కోకట్ ఎత్తిపోతలపథకాల ఆనవాళ్లు కనిపించ కుండాపోయాయి. బషీరాబాద్‌మండలం నావంద్గి, జీవన్గి, ఇందర్‌చేడ్ గ్రామాల్లో లిఫ్టులు కొన్నాళ్ల పాటు పనిచేశాయి. కొన్నాళ్లక్రితం ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీష్‌రావు బషీరాబాద్ లిఫ్ట్‌కు రూ.75లక్షలు మంజూరుచేస్తామని రూ.40లక్షలు మంజూరుచేశారు. ఫలితంగా ఈలిఫ్ట్‌పనులు గాలి కొదిలారు.

**ఆరు టిఎంసిలపై అధికారం...**
కాగ్నా నదీజలాలను 6టిఎంసిల వరకు వినియో గించుకునే హక్కు ఉందని కేంద్ర జలవనరుల సంఘం ఏనాడో సూచించింది. కాగ్నాపై మధ్య తరహా ప్రాజెక్టును నిర్మించే అవకాశం ఉన్నా పట్టిం చుకోలేదు. ఆరేళ్లక్రితం రూ.8.50కోట్లతో పాత తాండూరువద్ద కాగ్నాపై చెక్‌డ్యాం మంచినీటికి ఉపయోగపడుతోంది. ఇటీవల కోకట్ - బెన్నూరు సరిహద్దులో మరో చెక్‌డ్యామ్ పూర్తిచేశారు. కాగ్నా జలాలను కర్నాటకలో సద్వినియోగం చేసుకుంటు న్నారు. అక్కడ 8చోట్ల రోడ్ కమ్ బ్యారేజీలు నిర్మించి రైతులభూములు సస్యశ్యామలం చేస్తు న్నారు. ఇక్కడ పెద్దేముల్, యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల్లో భారీ చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే తాండూరునియోజకవర్గంలో నీటిపారుదల శాతం మెరుగుపడుతుంది.

**'హామీల సాగర్'...**
యాలాలవద్ద శివసాగర్ కేవలం హామీలకే పరిమి తమైందని విమర్శలు వస్తున్నాయి. 20ఏళ్ల క్రితం ప్రారంభించిన పనులు ఇంకా పూర్తికాలేదు. కాకర వేణినదిపై శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ముళ్లపొదలు పెరి గాయి. ఆరంభంలో 2వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వాలు చివరకు 1000ఎకరాలకే కుదించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి


నిరుపయోగంగా లిఫ్ట్

స్వయంగా శంకుస్థాపనచేసిన ఈప్రాజెక్టు పూర్తి చేయించడంలో పాలకులు విఫలమైనారు. కొంత మంది భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించ వలసి ఉందని సమాచారం. కాల్వల నిర్మాణం, తూము నిర్మాణం చేపట్టేందుకు మరో 15 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా. వాస్తవానికి ఈప్రాజెక్టుకు రూ.5కోట్ల అంచనావేశా రు. పనులు అరకొరగాచేపట్టి గాలికి వదిలేశారు. 2009లోపున:ప్రారంభించగా అంచనాలు రెట్టింపు అయ్యాయి. మూడోసారి ఆగిపోయిన తర్వాత రూ.20కోట్ల అంచనాలు రూపొందిం చారు. ఇప్పుడు రూ.15కోట్లను కేటాయిస్తే ప్రాజె క్టును ఉపయోగంలోకి తీసుకురావచ్చని భావిస్తున్నారు.

**మధ్యతరహా ప్రాజెక్టులకూ నిధులేవీ?...**
కోటపల్లి, లఖ్నాపూర్, జుంటుపల్లి మధ్యతరహా ప్రాజెక్టులుసహా మోమిన్‌పేట వద్ద గల నందివాగు ప్రాజెక్టు, మర్పల్లిలో కొంశెట్టిపల్లి ప్రాజెక్టు, తాండూరుమండలంలో శ్రీరాములవారిప్రాజెక్టు లకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. కాల్వల మరమ్మతులు చేపట్టక చివరి ఆయకట్టు భూములకు నీరు చేరడంలేదు. జిల్లాలో నీటిపారు దలకు రూ.200కోట్లు కేటాయిస్తే మరమ్మతులు చేపట్టవచ్చని అంటున్నారు. ఈదిశగా ప్రభుత్వం చొరవతీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్


అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేష్

**బషీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గొట్టిగకలాన్‌గ్రామం ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల అధ్యాపకురాలితో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నభోజనాన్ని అందించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చేపిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని అంగన్వాడి టీచర్‌కు, ఆయాకు ఆదేశించారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**బషీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:**
లక్ష్మీనారాయణపూర్ నుండి మైల్వార్‌వరకు రోడ్డువిస్తరణ పనులకు రూ106కోట్ల నిధులతో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపనచేశారు. యాలాల్ మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా నుండి బషీరాబాద్ మండలం వరకు రోడ్డువిస్తరణ పనులకు 68కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బషీరాబాద్ నుండి మైల్వార్ వరకు రూ.38కోట్లతో రోడ్డు అభివృద్ధిపనులకు శంకుస్థాపనచేశారు. ఈసందర్భంగా మండలనాయకులు, ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో మండలనాయకులు, పార్టీకార్యకర్తలు, అధికారులు ఉన్నారు.

## పేదల కల సాకారం...
**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**


ఇళ్ల నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కొత్తూర్, మార్చి 12, ప్రభాతవార్త:**
పేదలకలలైన సొంతగృహాన్ని అందించడమేలక్ష్యంగా కాంగ్రెస్‌ప్రభుత్వం ముందుకు సాగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూర్‌మండలంలోని పెద్దగుట్టతండా, మక్తగూడ లో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం శంకుస్థాపనచేశారు. ఈసంద ర్భంగా లబ్దిదారులతోకలిసి భూమిపూజనిర్వహించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలప్రభుత్వమని, ఎల్లప్పుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. సొంత ఇల్లు అనే ఆశ నెరవేర్చేందుకు కాంగ్రెస్‌ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపడమే మాప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికలసమయంలో ఇచ్చిన హామీ లను పక్కగా అమలుచేస్తామని, స్పష్టంచేసిన ఎమ్మెల్యే శంకర్, త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ అరుందతి, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షులు జండగూడెం సుదర్శన్‌గౌడ్, మాజీసర్పంచ్ రాందాస్‌నాయక్, నందిగామ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు నరసింహ, మాజీ ఎంపిటిసి కుమారస్వామిగౌడ్, మాజీసర్పంచ్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు దయానంద్‌గుప్తా, దయ్యాల మల్లేష్, బోకుల రాజు, ఓబిసిసెల్ చైర్మెన్ వడ్డే శేఖర్, మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్, గ్రామ కమిటీ అధ్యక్షులు దయ్యాల శ్రీను, శ్రీరాములు, శ్రీను, సిద్దుగౌడ్, శంకర్, లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెనూప్రకారం భోజనం అందజేయాలి
**-తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్**


విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని తీసుకుంటున్న తహసీల్దార్

**పెద్దేముల్, మార్చి 12, ప్రభాతవార్త:**
విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందజేయాలని తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్ అన్నారు. బుధవారం పెద్దేముల్‌మండలంలోని మారెపల్లి కెజిబివిలో ఉదయం అల్పాహారాన్ని, మధ్యాహ్నం పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్‌కళాశాల, గొట్లపల్లి మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులతోకలిసి భోజనంచేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న మధ్యాహ్నభోజనవిషయంలో నిర్వా హకులు నిర్లక్ష్యం వహించరాదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని అన్నారు. విద్యార్థులు కష్టపడిచదివి ఉన్నతస్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రైవేటుపాఠశాల లకు ధీటుగా ప్రభుత్వపాఠశాలల్లో విద్యాబోధనలు కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. తహసీల్దార్‌వెంట మండలవిద్యాధికారి నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

## విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి
**-ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి ఆకాష్‌నాయక్**

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త:**
రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30శాతం నిధులు కేటాయించడంతోపాటు విద్యాశాఖ మంత్రిని నియమించాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డిజిల్లా సహాయకార్యదర్శి ఆకాష్‌నాయక్ డిమాండ్‌చేశారు. షాద్‌నగర్ గిరిజనబాలికల వసతిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆకాష్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యారంగసమస్యలు పరిష్కారంకాలే దని, గతప్రభుత్వ విధానాలను కొనసాగిస్తూ విద్యారంగసమస్యలను నిర్లక్ష్యంచేస్తుందన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఉపాధ్యక్షుడు అరుణ్, పద్మ, అనూష, ప్రకాష్, శ్రీను, రాజేష్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆకాష్ నాయక్

## అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి**


జ్యోతివెలిగిస్తున్న మేడ్చల్‌జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పాల్గొన్న జిల్లా అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త:**
మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, వారిలో పోటీ తత్వంతోపాటు చైతన్యంకూడా పెరిగిందని మేడ్చల్‌జిల్లా అద నపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రశంసించారు. బుధవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకలెక్టరేట్‌లోని సమావేశమందిరం లో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత ఆధ్వ ర్యంలో ప్రపంచ మహిళాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి పలువురుమహిళలను సన్మానించి అభినందిం చారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొని పలువురుమహిళలను, మహిళాఉద్యోగులను సన్మా నించి అభినందనలుతెలిపి ప్రపంచ మహిళాదినోత్సవ శుభా కాంక్షలు తెలియజేశారు. దీనిలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శోభారాణి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, సిడబ్ల్యుసి మెంబర్ ఎం.అర్చన, సిడిపిఒస్ శారద, పిఓ రేణుక, స్వాతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు సరిత, శ్వేత, కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులుపాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేశారు. జిల్లా లోని అన్నివిభాగాల్లో పనిచేస్తూ జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సత్కరించి సన్మానంచేసి మొమెంటో లను, ప్రశంసపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత అందజేసి ప్రశంసించారు. మహిళలను ప్రోత్సహించటానికే అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవటం జరిగిందని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పలువురు జిల్లా మహిళా అధికా రులు, మహిళాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సేంద్రియ రైతుల సమ్మేళనం

### ముఖ్య అతిథులుగా హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**శంకర్‌పల్లి, మార్చి 12, ప్రభాతవార్త:**
శంకర్‌పల్లిలో ఏప్రిల్ 4న ఏకలవ్య గ్రామీణవికాస్ ఫౌండేషన్ జనుగుర్తి కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి సేంద్రియ రైతుల సమ్మేళన కార్యక్రమం జరగనుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మాణిక్‌రెడ్డి, మాజీఏఎంసి చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలోని అతిథిగృహంలో రైతుసమ్మేళన కార్యక్రమం కరపత్రాన్ని వారు విడుదలచేసి మాట్లాడారు. రైతులకు గిట్టుబాటుధర, వ్యవసాయ దారుడికి గౌరవం, ప్రజలందరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో దేశమంతటా, రాష్ట్రమంతటా మన జిల్లాలోకూడా ప్రయత్నంజరుగుతున్నదన్నారు. అనేక సంవ త్సరాలుగా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు (పెస్టిసైడ్లు) విచక్షణారహితంగా వాడటంవలన భూమి కలుషి తమై పోయిందన్నారు. మన భారతీయ ఆవుపేడలో, ఆవు మూత్రలో భూమిని సారవంతముచేసే కోట్లాది జీవాణువులు ఉన్నాయనేది జగమెరిగినసత్యం, కానీ మనం మర్చిపోయామ న్నారు. సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ, కేంద్రమంత్రి జితేంద్రసింగ్ హాజరు కానున్నారని రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి డిఐజి రిటైర్డ్ ఇండియన్ కోస్ట్‌గార్డ్, మాణిక్యరెడ్డి వ్యాపారస్తులు, నాగి రెడ్డి, మిర్యాల శ్రీనివాస్, బచ్చు రామ్మోహన్, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, భస్వరాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నితిన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వభూమిలో దర్జాగా రోడ్డు నిర్మాణం

**-కబ్జా దారునికి స్థానిక నాయకుల అండదండలు**
**-చోద్యం చూస్తున్న అధికారులు**

**వికారాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:**
భూబకాసురులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. ఖాళీ జాగా కనిపించినా..ప్రభుత్వభూమి కనిపించినా దర్జాగా కబ్జా చేస్తు న్నారు. కాసిన్ని డబ్బులు పారేస్తేచాలు ప్రభుత్వ భూములైనా కబ్జాచేయవచ్చనే ధోరణిలో కబ్జాదారులు వ్యవహరిస్తున్నారు. దానికితోడు వారికి రాజకీయనాయకుల అండదండలు మెండు గా ఉండటంతో తమకు అడ్డు ఎవరూలేరన్నట్లుగా వ్యవహరి స్తున్నారు. ఇలాంటిఘటనలు వికారాబాద్‌మున్సిపల్ పరిధిలో పరిపాటిగా దర్శనమిస్తాయి. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్రెపల్లి రెవెన్యూపరిధిలో దాదాపు 90ఎకరాల పట్టాభూమిని కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన భూమిలో ఫాం ల్యాండ్ ఏర్పాటుచేయాలనిభావించి, ముందుగా ప్రధానరహదారిపనులు చక్కబెట్టాలని అనుకున్నాడు. రోడ్డుమార్గం బాగుంటేనే ఫాం ల్యాండ్ విక్రయాలు సులువుగా అవుతాయని భావించాడు. దీంతో హైదరాబాద్, వికారాబాద్ ప్రధానరోడ్డు మార్గం నుంచి అతను కొనుగోలుచేసిన భూమికి నేరుగా వెళ్ళేలా నక్ష బాటను ఎంచుకున్నాడు. ఈనక్షబాట కొత్రెపల్లి మీదుగా, మద్దులగడ్డ తాండవరకు వెళ్తుంది. ఈనక్షబాట పొలానికివచ్చే దారి మధ్య లోనేముగిసిపోవడంతో రియల్‌వ్యాపారి కొనుగోలుచేసినభూమి వరకు రోడ్డుమార్గం నిర్మించడం కష్టతరంగా మారింది. అతని పొలానికి దారికావాలంటే కొత్రేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 164లోగల ప్రభుత్వభూమిలోనుంచి రోడ్డునిర్మించుకో వాల్సి ఉంటుంది. ఈసర్వేనెంబరులో కొంతమందిరైతులు లావుణి పట్టాపొంది వ్యవసాయంచేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. తనభూమికి ఎలాగైనా ప్రభుత్వభూమిలోంచి దారి వేసుకోవాలని సదరు రియల్ వ్యాపారి భావించి, సంబంధిత రైతులకు డబ్బులను ఎరవేశాడు. లావుణి పట్టా పొందిన రైతులు సహకరిస్తే ముందుగా తాను దారివేసుకుని, తదనంతరం గుంటభూమికి రూ.50వేల వరకు పరిహారంగా చెల్లించుకుంటానని రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. రోడ్డుపనులు ముగుస్తున్నా సంబంధిత రైతులకు డబ్బులు ఇవ్వకపోవడంతో రెవెన్యూ అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆవ్యాపారి ప్రభుత్వభూమి కబ్జాతతంగం బయటపడింది. అధికారులనుసైతం సంబంధితవ్యాపారి మభ్య పెట్టే ప్రయత్నం చేశాడు. వారు తలొగ్గకపోతే తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి రోడ్డుమార్గాన్ని పూర్తిచేశాడు. అధికారులు రంగంలోకి దిగి పనులు నిలిపివేశారు.

## చిక్కుముడిగా 'బంగారు' దొంగలు

### నెలరోజులు గడిచినా లభించని క్లూ
### 40తులాలపై తలలుపట్టుకున్న పోలీసులు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**
తాండూరు పోలీసులకు సవాలువిసిరిన బంగారందొంగల కేసు చిక్కుముడి వీడటంలేదు. సరిగ్గా నెలరోజుల క్రితం ఒకరోజు 40తులాల బంగారం, ఐదు లక్షలరూపాయల నగదు దోచుకున్న సంఘటననుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. ఇందులో ఒకకేసు పట్టపగలే జరగడం విశేషం. జనా వాసానికి దూరంగా ఉన్న గ్రీన్‌సిటీలో విలేకరి ఇంట్లో జరిగిన దొంగతనం కేసు నిందితుడిని సిసి ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. జడ్చర్ల, తాండూరు, షాద్ నగర్ ప్రాంతాలలో ఈవ్యక్తి చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, తాండూరు పోలీసులు ఈదొంగకోసం వేటాడుతున్నారు. అయితే సాయిపూర్ దొంగతనంకేసు మాత్రం మిస్టరీగా మారింది. జనావాసాల మధ్య ఉన్న వెంకట్‌రెడ్డి నివాసంలో రాత్రిపూట భారీదొంగతనంజరిగింది. అదే ప్రాంతంలో ఉన్న ఆలయంలో మైక్‌ల చప్పుడు కారణంగా దొంగతనం గురించి ఇరుగుపొరుగువారు పసిగట్టలేకపోయారు. ఈకేసు పురోగతిసాధించినట్లే అని పించినా చివరకు దొంగనుగుర్తించడంలో మల్లగుల్లాలుపడుతున్నారు. వెంకట్ రెడ్డికి అనుచరుడైన ఓవ్యక్తిని పోలీసులు విచారించారు. సిసిఫుటేజీలో క్లియర్‌గా కనిపించనందున అనుమానితుడుగా భావించి సిసిఎస్‌కు తరలించారు. ఫోన్ కాల్స్‌పైకూడా నిఘాపెట్టారు. కానీ నిజాలు రాబట్టలేకపోయారు. ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు బాధితుడు వెంకట్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, వారివ్యవహారంపై పెద్దగా అనుమానంరాకపోవడంతో పోలీ సులు దీనిపై మరింత లోతైనదర్యాప్తు చేస్తున్నారు. దొంగతనంజరిగిన పరిసరా లలో కారంపొడి చల్లినట్లు గుర్తించారు. ఇలాంటి సంఘటనలు నిజామాబాద్, కరీంనగర్‌లో జరిగాయి. పోలీసులజాగిలాలు గుర్తించకుండా ఈవిధమైన దొంగ తనాలు చేస్తారని అంటుంటారు. మరోవైపు బాధితులు తరచూ పోలీసుస్టేషన్ చుట్టూతిరుగుతూ తమకు న్యాయంకావాలని కోరుతున్నారు. దొంగతనం దర్యా ప్తులో పోలీసులకు సంపూర్ణసహకారం లభించడంలేదని తెలుస్తున్నది. అను మానితులను పోలీసులు విచారించే అధికారం ఉన్నా కొంతమంది ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

## వైన్‌షాపులో అర్థరాత్రి చోరీ
**-65వేల నగదు, మద్యం బాటిళ్ళు ఎత్తుకెళ్ళిన దొంగలు**


రావులపల్లిలో చోరీకిగురైన వైన్‌షాపు

**కొడంగల్, మార్చి 12, ప్రభాతవార్త:**
కొడంగల్‌మండలంలోని రావులపల్లి గ్రామంలోని వైన్‌షాపులో చోరీ జరిగింది. సంఘటనకు సంబంధించి వైన్‌షాపు నిర్వాహకులకథనం మేరకు, గ్రామ సమీపంలోగల ఎస్‌విపి బసవేశ్వర వైన్‌షాపులో మంగళవారం అర్థరాత్రి చోరీ జరిగిందని తెలిపారు. వైన్‌షాపుకు ఉన్న తాళాలుపగులగొట్టి టివి, వైఫై రూటర్, హార్డ్ డిస్క్, మద్యం బాటిళ్ళు, బీరు సీసాలతో పాటు రూ.65వేల నగదు చోరీకి గురైందని వైన్‌షాపు నిర్వాహకులు తెలిపారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేయడంతో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు. కాగా వరుసచోరీలతో వ్యాపారులు, ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు.

## పోలీసుల చేతుల నుండి తప్పించుకొని దొంగ పరార్

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త:**
సైబరాబాద్ పరిధిలోని షాద్‌నగర్ పట్టణంలోని సిండికేట్ కాలనీలో గత ఐదురోజులనుంచి బీహార్‌రాష్ట్రానికిచెందిన ఓదొంగ పగలు రెక్కీనిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్న దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సిసికెమెరారికార్డుల దృశ్యాల ఆధారంగా కాలనీవాసులు దొంగతనానికి పాల్ప డుతున్నవ్యక్తిని పసిగట్టి చాకచాక్యంగా పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు దొంగను కాలనీవాసులచేతులనుండి తమచేతుల్లోకి తీసుకొస్తున్నక్రమంలో అక్కడేపోలీసు లను తప్పించేసి దొంగకూడా అంతేచాకచక్యంగా పరారయ్యాడు. దీంతో తాము కష్టపడి దొంగనుపట్టుకొని పోలీసులకు అప్పగిస్తే వారిచేతిలోనుండి పారిపోవడం ఏమిటని కాలనీవాసులు మండిపడుతున్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన ధ్యేయం

- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి



కోలన్ హన్మంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

**నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త**

మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన ధ్యేయమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ పరిధిలోని 4వ డివిజన్ వాసులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డిని కలిసి డివిజన్ లో నెలకొని ఉన్న మౌలిక సదుపాయాల సమస్యపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ వారి ఇబ్బందుల గురించి పై అధికారులతో మాట్లాడి అతి త్వరలో చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ అధ్యక్షులు సురేందర్ కుమార్, 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజి రెడ్డి, 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పద్మరావు, ప్రశాంత్ రెడ్డి, షఫీ, శివ కుమార్, మల్లేష్, మొహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలుగా బానుక నర్మద ప్రమాణస్వీకారం



ఊరేగింపుగా కంటోన్మెంట్ బోర్డుకు వస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, బోర్డు సభ్యురాలు బానుకా నర్మద తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 12 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలుగా బుధవారం పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఓపెన్ టాప్ జీపుపై ఎంపీ ఈటల రాజేందర్ నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్ మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక బిజెపి కాంటెస్ట్ ఎమ్మెల్యే డాక్టర్ వంశ తిలక్ అధికార ప్రతినిధి బిఎన్ శ్రీనివాస్ నాయకులు భానుక మల్లికార్జున్ బాణాల శ్రీనివాస్ రెడ్డిలతోపాటు నియోజకవర్గంలోని 8 వార్డుల అధ్యక్ష కార్యదర్శులు మోండ డివిజన్‌లకు చెందిన బిజెపి అధ్యక్ష కార్యదర్శులు కార్యకర్తలు అభిమానులు భారీ ఊరేగింపుతో కంటోన్మెంట్ బోర్డ్‌కు తరలివచ్చి నామినేట్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డ్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

## ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్, మార్చి 12 ప్రభాతవార్త:**

మోండా డివిజన్ బండిమెట్‌లో గల షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ పూజలలో మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్. పాల్గొన్నారు. ఆలయం నిర్మించి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. పూజల అనంతరం ఆలయ నిర్వహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. ఈ పూజా కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు నాగులు, మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు వెంకట్ రావు, నంద గోపాల్, శంకర్, జనార్దన్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

-పాల్గొన్న ఎమ్మెల్యే, ఎసిపి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్, ఏసీపీ జయపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్ తదితరులు

**సికింద్రాబాద్, మార్చి 12 ప్రభాతవార్త:**

పద్మారావునగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజలలో మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. మంగళవారం ఆలయంలో చోరీ జరిగిన నేపథ్యంలో బుధవారం వేద పండితుల సూచనల మేరకు శాస్త్రోక్తంగా ఆలయ సంప్రోక్షణ, అమ్మవారికి అభిషేకం, పంచ హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలలో తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ పూజలలో చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్ రెడ్డి, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్ గౌడ్, పద్మారావునగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, రాజు, ఆలయ నిర్వహకులు సాయిరాం చారి, హరి చారి, నాయకులు ఏసూరి మహేష్, ప్రేమ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, రమణ, మహేందర్ గౌడ్, కుమార్ యాదవ్, ముక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముఠాపద్మను పరామర్శించిన కార్పొరేటర్

**చిక్కడపల్లి, మార్చి 12 ప్రభాతవార్త:** ఇటీవల అనారోగ్యం నుండి కోలుకొని తమ స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్‌ను గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ బుధవారం పరామర్శించారు. సందర్భంగా ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్పొరేటర్ వెంట బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, జి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్‌ను పరామర్శిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

## మత అహంకార శక్తుల తాట తీస్తాం: ఈటెల రాజేందర్

**కుత్బుల్లాపూర్, మార్చి 12 ప్రభాతవార్త**

మత సామరస్యంపేరిట హిందూ దేవాలయాలపై దాడులకు పాల్పడుతున్న సంఘ వ్యతిరేక శక్తుల భరతం పట్టడంతోపాటు ధర్మపరిరక్షణ కోసం త్యాగాలకు వెనుకాడబోమని మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యులు ఈటెల రాజేందర్ హెచ్చరించారు. జీడిమెట్ల గాంధీనగర్‌లో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంపై దాడీ, చోరీ సంఘటనకు స్పదించిన ఈటెల మంగళవారంరాత్రి సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా హిందూధర్మసంఘాలు, భారతీయ జనతాపార్టీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ దొంగలు, సైకోలు, షాడిస్టుల పేరుతో మతోన్మాదులు హిందూ దేవాలయాలపై ఉద్దేశపూర్వక దాడులు నిర్వహిస్తున్నారని దీనిపై ప్రభుత్వం, పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని అరికట్టాలని డిమాండ్‌చేశారు. అలా చేపట్టకపోతే సంపూర్ణబాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని హెచ్చరించారు. ముత్యాలమ్మ దేవాలయంపై దాడులను సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులుగా భావిస్తూ వెంటనే నియంత్రించాలని అన్నారు. హిందూ దేవాలయలపై దాడుగుజరుగుతుండగా హిందువునే కొడుతున్నారని దీనినితీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దాడికి పాల్పడిన హామీద్, ఖాజాలు చేసిన మత పరమైన దాడులను ఎంతమాత్రం సహంచబోమని హెచ్చరించారు. హిందువుల మనోభావాలకు, ధర్మానికి, సహనానికి, ఓపికకు సంబందించిన విషయంగా గుర్తించి ప్రభుత్వం తగుచర్యలు చేపట్టాలని సూచించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా దాడులు ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ధర్మంపై దాడులను నిరోధించేందుకు యావత్ హిందూ సమాజం ఒక్కటైతే దుర్మార్గుల కట్టడి ఎంతోదూరంలోలేదని హెచ్చరించారు. దేవాలయపై దాడులు పోలీసులకు సంబందంలేదని దానిని నిలువరించేందుకు మాత్రమే ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహారించాలని ఈటెల రాజేందర్ సూచించారు. కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ ఓబిసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందనం దివాకర్, మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ జె.కె.శేఖర్‌యాదవ్, గరిశె శేఖర్ ముదిరాజ్, రంగా శ్రీనివాస్‌గౌడ్, చింతల్ డివిజన్ కొట్టే రాజా సదానంద్‌లతోపాటు భారీఎత్తున బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని హిందూసమాజ నినాదాలు చేసారు.




## బుధల అమర్ బాబుకి గౌరవ డాక్టరేట్..



కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసిన బుధల అమర్ బాబు

**నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 127 డివిజన్ రంగారెడ్డి నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుధల అమర్ బాబుకి గౌరవ డాక్టరేట్‌తో పాటు డా.బి.ఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించిన సందర్భంగా బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంత్‌రెడ్డి అమర్ బాబును శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియాజేసారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా దళిత సంఘం అధ్యక్షులు డాక్టర్ అవిజె జేమ్స్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ జంగిర్ హుస్సేన్, అంజన్న, ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : భరత్ గౌడ్



అడ్డగుట్ట బిజెపి కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, డివిన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య తదితరులు

**అడ్డగుట్ట, మార్చి 12 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లో బిజెపిని మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం అడ్డగుట్టలో నిర్వహించిన బిజెపి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షురాలు, గాజుల సౌందర్య, నాయకులు జి.హంసరాజ్, శ్యామ్ సుందర్, వీరేశం, సాయన్న, గెల్లు ఉదయ్ యాదవ్, శివాజీ, రాజేశ్, లక్ష్మణ్, వెంకట్ స్వామి, బాబు, శ్రీధర్, చింటూ, రాములమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్



మహిళలకు బహుమతులు ప్రధానం చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 12 ప్రభాతవార్త:** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మహిళలకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు మరింత ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నేతలు చిరబోయిన సంతోష్ యాదవ్, రంగ రవిందర్ గుప్త, బల్వంత్ రెడ్డి, నాగినేని ఎసరిత, చిరబోయిన వైష్ణవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక చిత్ర వైభవం పుస్తకం చరిత్రలో నిలిచిపోతుంది ప్రముఖ సినీనటి ప్రభ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ సినీనటి ప్రభ

**ముషీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** రచయిత వైట్ల కిషోర్ కుమార్ రచించిన చారిత్రక చిత్ర వైభవం పుస్తకం చరిత్రలో నిలిచిపోతుందని ప్రముఖ సినీ నటి ప్రభ అన్నారు. రవీంద్రభారతి లో జరిగిన చారిత్రక చిత్ర వైభవం పుస్తకావిష్కరణ కార్యక్రమంకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర్ కుమార్ చారిత్రక చిత్రాల లోని సన్నివేశాలను పుస్తక రూపంలో ఎంతో అద్భుతంగా తీసుకువచ్చారని కొనియాడారు. అనంతరం సినీ విజ్ఞాన విశారథ ఎస్.వి.రామారావు, మాణికేశ్వరి దంపతులకు ఈ పుస్తకాన్ని అంకితమిచ్చారు. సాంస్కృతిక బంధు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, సినీ నటులు సుబ్బరాయశర్మ, యువకళా వాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత మనందరిపై ఉంది



బాలింతలకు మిల్క్ బ్రెడ్లు పంపిణీ చేస్తున్న అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సన్నీ రాపాక

**చార్మినార్, మార్చి 12 ప్రభాతవార్త :**

పేద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సన్నీ రాపాక అన్నారు. పాతబస్తీ పెట్లాబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని బాలింతలకు అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిల్క్ బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షిత ఫౌండేషన్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. బీద ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెట్లాబుర్జు ఆసుపత్రి హెల్త్ సూపర్ వైజర్ డి.వినోదా భాయి, సునీల్ కుమార్, రాజేష్, తానాజీ, వాసవి, లత, అనూష పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులు అరెస్ట్



గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులు అరెస్ట్ చిత్రం

**మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 12 ప్రభాతవార్త :**

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడ ఆర్‌జికె ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండ గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... బండ్లగూడకు చెందిన సయ్యద్ అర్షాద్ (25), లక్ష్మీగూడ చెందిన మహ్మద్ ఖాజా సోహైల్ (25), రాంనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ (19). మహ్మద్ అమీర్ (19)లు కలిసి గుట్టు చప్పుడు కాకుండ లక్ష్మీగూడ ఆర్‌జికె ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నలుగురు యువకులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికై ఎన్‌సీడీ స్క్రీనింగ్ డ్రైవ్

-ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి

**ముషీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఎన్‌సీడీ స్క్రీనింగ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ స్క్రీనింగ్ డ్రైవ్‌ను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక మరణాలకు కారణం గుండె జబ్బులు, స్ట్రోక్, క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు మరియు మధుమేహం వంటి నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) అని తెలిపారు. ఈ ఎన్‌సీడీలకు ఆధారం పొగాకు, హానికరమైన మద్యం వాడకం, అనారోగ్యకరమైన ఆహారం, తగినంత శారీరక శ్రమ లేకపోవటం, అధిక బరువు, ఉబకాయం, బీపీ, మధుమేహం, కొలెస్ట్రాల్ అన్నారు. ఈ వ్యాధులను అధిగమించాలంటే వీటిపై అవగాహన ఉండాలని, ఈ వ్యాధులు అంటు వ్యాధులు కావని, వీటిని జీవన శైలి జబ్బులు అని అంటారని, ఆధునిక ప్రపంచం మోసుకొచ్చిన మార్పులే ఈ జబ్బులకు మూలమని అన్నారు. 30 ఏళ్ల వయసు వారిలో కూడా నేడు రక్తపోటు, మధుమేహం వంటి జబ్బులు సర్వసాధారణం అయ్యాయని, అందుకే 30 ఏళ్లు పైబడిన వారందరికీ ఎన్‌సీడీ స్క్రీనింగ్ డ్రైవ్ ద్వారా పరీక్షలు నిర్వహించటం జరుగుతోందని తెలిపారు. ఆశాలు, ఏఎన్‌ఎమ్‌లు ఇంటింటికీ తిరిగి ఎన్‌సీడీ పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రజలకు కూడా వీటిపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం పద్మలత, ఆశాలు లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.



ఎన్‌సీడీ స్క్రీనింగ్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

## థాయ్ లాండ్ విద్యాసంస్థలో విజెఐఎం పరస్పర సహకార ఒప్పందం..

**నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త**

థాయిలాండ్ దేశానికి చెందిన విద్యాసంస్థ ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఇరు కళాశాలలకు చెందిన విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు, బోధనాపద్ధతులను తెలుసుకునే అవకాశముందని కళాశాల వర్గాలు తెలిపాయి. డైరెక్టర్ విజెఐఎం డా. భరత్ భూషణ్సింగ్, డా.రవినాధ్, ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సభ్యులు డా. నితిన్ కె. త్రిపాఠి, ఎం.రణధీర్‌రెడ్డి మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అనంతరం లెటర్ ఆఫ్ అగ్రిమెంట్స్ పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా భరత్ భూషణ్ సింగ్ మాట్లాడుతూ ఈ అవకాశం ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకొని తమలోని ప్రతిభను మెరుగుపచుకునే అవకాశముందని తెలిపారు. ప్రపంచ దేశాలకు చెందిన విద్యావేత్తలు, వ్యాపారవేత్తలను కలవడం, అక్కడ అభివృద్ధి పథకాలు, వాటి నిర్వహణపై అధ్యయనం చేసే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు రెండు దేశాలకు చెందిన విద్యాబోధన మరెన్నో విషయాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ ప్రోగ్రాం విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రెండు వారాల పాటు నిర్వహించిన ఈ ప్రోగ్రాంలో బిజెఐఎంకు చెందిన 238 మంది విద్యార్థులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లుగా కళాశాల అధ్యాపకులు డా.రవినాథ్, డా. నిహారిక, డా. హరిప్రియ, డా.పద్మజ, డా. అమర్నాథ్ రెడ్డి, డా.శ్రీనివాసరావులు వ్యవహరించారు. విజెఐఎంకి చెందిన డా. రాకేష్ పాత్ర తెలుపుతూ ఇటువంటి ప్రోగ్రాంలు విద్యార్థులకు అంతర్జాతీయ విద్యాభోధనా పద్దతులు తెలుసుకునే అవకాశముందని అన్నారు.



ఒప్పందం కుదుర్చుకున్న ఇరు కళాశాలలు

## నీరాకేఫ్‌ను కల్లుగీత ఫెడరేషన్‌కి బదిలీ చేయటం హర్షనీయం

-కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్

**ముషీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:** టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్‌ను బీసీ సంక్షేమ శాఖలోని కల్లుగీత ఫెడరేషన్‌కు బదిలీ చేయడం హర్షనీయమని తెలంగాణ గౌడ కల్లుగీత ఫెడరేషన్‌కు బదిలీ చేయడం హర్షనీయమని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయకుమార్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.వి.రమణలు అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నీరాకేఫ్ పూర్తి ఆస్తులను టూరిజం శాఖ నుండి కల్లుగీత కార్పోరేషన్‌కు బదలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ల చొరవతో టూరిజం శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పలుమార్లు జరిపిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకోవటం అభినందనీయమని అన్నారు. నీరాకేఫ్ భవనం, దాని పరిధిలో ఉన్న ఆస్తులను కల్లుగీత ఫెడరేషన్‌కు బదిలీచేస్తూ ఐదు శాఖల మంత్రులు ఒప్పందంపై సంతకాలు చేయడం కూడా జరిగిందని తెలిపారు. కల్లుగీక కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బొమ్మ మహేష్ కుమార్‌లకు వారు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబాల నారాయణగౌడ్, గడ్డమీది విజయ్ కుమార్‌గౌడ్, బాలగోని వెంకటేష్‌గౌడ్, పోతగాని అయిలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్

## ఇఫ్తార్‌లు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి



బోరబండ సైట్ 1లో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు సహరేణి ఏర్పాటు చేసిన కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్.

**యూసుఫ్‌గూడ, మార్చి 12, ప్రభాతవార్త**

బోరబండ ఎన్‌ఆర్‌ఆర్‌పురం సైట్ 1లోని ముస్లిం సోదరులకు రంజాన్ మాసం సందర్భంగా గ్రేటర్ మాజీ ఉపమేయర్, బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం సహరేణి ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలను పురస్కరించుకుని వారికి మనతో అయినంత వరకు సేవ చేయాలన్నా తలంపుతో రంజాన్ రోజు ప్రారంభం నుండి చివరి రోజు వరకు గత 10 సంవత్సరాలుగా ప్రతి రోజు ముస్లిం సోదరులకు సహరి భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని బోరబండ కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్ పేర్కొన్నారు. ఉపవాస దీక్ష 11వ రోజు సందర్భంగా బుధవారం తెల్లవారు జామున ముస్లిం సోదరులతో కలిసి బాబా ఫసియుద్దీన్ సహేరి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్న సహరి కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా హిందు ముస్లింలు కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. హిందు సోదరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ముస్లిం సోదరులకు ప్రేమ ఆప్యాయలతో భోజనాలు వడ్డిస్తారని ఇది మతసామర్యానికి ప్రతీకలుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, గోధుమలు సీజ్

**అత్తాపూర్ మార్చి 12, ప్రభాతవార్త :** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, గోధుమలను సీజ్ చేసిన ఘటన అత్తాపూర్ పోలీసులు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు వివకాల ప్రకారం.... అత్తాపూర్‌లోని పిల్లర్ నెంబర్ 241 సమీపంలో పక్కా సమాచారంతో పోలీసు సిబ్బంది హనుమంతు, బ్రహ్మచారి విధులు నిర్వహిస్తూ అటుగా వెళుతున్న ఓ అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీలు చేశారు. 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం, అదేవిధంగా 8 క్వింటాళ్ల గోధుమలు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంతోష్ కుమార్ అనే వ్యక్తి ఇద్దరు మధ్యవర్తుల ద్వారా రేషన్ సరుకులు బడుగు బలహీన వర్గాల నుంచి సేకరించి ఎక్కువ ధరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ జలమండలి అధికారులకు వినతి



వెంగళరావు నగర్‌లో మంచి నీటి సమస్య పరిష్కరించాలంటూ మానేజర్ సూర్యప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న కన్జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి, డాక్టర్ పి.వి. రవిశేఖర్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ, మార్చి 12, ప్రభాతవార్త :**

గతంలో ఎన్నడు లేని విధంగా నెలరోజులుగా భూగర్భజలాలు అడుగంటి పోయి చుక్క నీరు లేని పరిస్థితి ఏర్పడిందని నీటి అద్దడి తీవ్రత తలెత్తడంతో వెంగళరావు నగర్ కాలనీలో సమస్యను పరిష్కరించాలంటూ జలమండలి మానేజర్‌ను వేడుకున్నారు. బుధవారం కన్జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి. రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ పెద్దలతో కలిసి మానేజర్ సూర్యప్రకాష్‌ను కలిసి సమస్యను వివరించి వినతీ పత్రం సమర్పించారు. కాలనీలో రోజు విడిచి రోజు వచ్చే తాగునీరు గత నెలరోజులుగా గంటన్నర మాత్రమే సరఫరా చేయడం జరుగుతుందని అది కూడా పూర్తిగా లో ప్రషర్‌తో సరఫరా కావడంతో కాలనీ వాసులతో పాటు బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తాగునీటి సరఫరా సమయం మరింతగా పెంచాలని లో ప్రషర్ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని మానేజర్ సూర్యప్రకాష్ వాళ్ళకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రంగారావు, సినియర్ సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షులు సారంగరావు, లక్ష్మీకాంతరావు, అశోక్‌కుమార్, గౌస్‌ఖాన్, నాగరాజు, పాల్గొన్నారు.

## గాయత్రినగర్ సంక్షేమ సంఘం కమిటి ఏకగ్రీవ ఎన్నిక

**యూసుఫ్‌గూడ, మార్చి 12, ప్రభాతవార్త**

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే కాలనీ ఎన్నికల్లో భాగంగా అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ సంక్షేమ సంఘం ఎన్నికల నామినేషన్‌లు నిర్వహించగా వి.కృష్ణారావు అధ్యక్షుని పోటీలో నామినేషన్ దాఖలు చేశారు. అతనితో పాటు పానెల్‌సభ్యులు ఉన్నారు. నామినేషన్ సమయం ముగిసే వరకు ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా అభ్యర్థిని ఎన్నికల అధికారులు కె.సూరిబాబు, టివియస్ రాజు, ఆకుతోట విటలయ్యలు, వి.కృష్ణారావు పానెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షులు వి.కృష్ణారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో గాయత్రి నగర్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు స్థానిక ప్రజా ప్రతి నిధులు, వివిధ శాఖల అధికారుల, కాలనీ వాసుల సహకారంతో ముందుకు వెళతామని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న రాకేష్

## విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

**హుస్నాబాద్ టౌన్, మార్చి 12, ప్రభాతవార్త :** బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని ఏబీవీపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంసాని రాకేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సంఘం పట్టణ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో విద్యారంగానికి నిధులు కేటాయించకుండా వ్యవస్థను చిన్నాభిన్నం చేయడాన్ని గుర్తించిన ప్రజలు ప్రభుత్వాన్ని గద్దెదించారని అన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి నిధులు కేటాయించకుండా విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందని నేడు విడుదలచేసే బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు మంజూరు చేయాలన్నారు.లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేష్, రాజు, రాహుల్, చరణ్, అంజి, సంతోష్, సిద్దు తదితరులు ఉన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 1,3,17వ వార్డులలో ప్రజలకు బసీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తడిపొడి చెత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఇళ్లలోనే తడి పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. వేరు చేయని చెత్తను మున్సిపల్ సిబ్బంది తీసుకోరని, అలాగని చెత్తను రోడ్లపై, మురుగు కాలువలో పడవేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రజలు చెత్తను వేరుచేసి ఇంట్లోనే కంపోస్టు ఎరువుగా తయారు చేసుకుని చెట్లకు ఎరువులుగా వాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ అధినేత ఉదయ్ ఉన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు


ప్రముఖ మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మార్చి 12,ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం సిద్దిపేటలో వాసవీ క్లబ్, వనిత, వాసవీ యూత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే ముందస్తుగా హోలీ పండుగ వేడుకలను రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో సేవచేస్తున్న మహిళలు జిల్లా న్యాయమూర్తి రమాదేవి, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ సువాసిని, ఆధ్యాపకులు రమాదేవిలను శాలువాతో ఘనంగా సత్కారించారు.కార్యక్రమంలో ఆయాక్లబ్‌ల ప్రతినిధులు గంప శ్రీనివాస్, గంప కృష్ణమూర్తి, పుల్లూరి శివకుమార్, మాంకాల నవీన్ కుమార్, పుల్లూరి శశాంక్, తోడుపునూరి కృష్ణవేణి, సోమ వనజ, శ్రీనివాస్, రవి, రాజేంద్ర ప్రసాద్, శివకుమార్, మర్యాల వాణి, పుల్లూరి సుష్మ, మాధవి పాల్గొన్నారు.

## ఆదర్శ మహిళా అవార్డుగ్రహీత జయమ్మకు సన్మానం


కొన్నె జయమ్మను సన్మానిస్తున్న మేకల కనకయ్య

**మర్కుక్, మార్చి 12 (ప్రభాతవార్త):** రాష్ట్ర ఆదర్శ మహిళా అవార్డు గ్రహీత, మాజీ ఎంపిటిసి, జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ సంఘం మహిళా అధ్యక్షురాలు కొన్నె జయమ్మను బుధవారం బిఆర్ఎస్ బిసిసెల్ మర్కుక్ మండల అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కమ్యూనిటీకి చెందిన జయమ్మకు రాష్ట్ర ఆదర్శ మహిళా అవార్డు రావడం సంతోషదాయకమని అన్నారు. ఆయనతోపాటు జగదేవ్‌పూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాగుల రాజు, మండల ఉపాధ్యక్షుడు రొయ్యల కరుణాకర్, మండల యూత్ ప్రధానకార్యదర్శి తీగుళ్ల బాలకిషన్, నాయకులు ప్రభాకర్, వెంకటేష్ ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

### -మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**ములుగు, మార్చి 12 (ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అచ్చాయిపల్లి, దాసర్లపల్లి గ్రామాలలో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే బహిలంపూర్ గ్రామానికి చెందిన మనీపవన్‌రెడ్డికి సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పేద ప్రజలను పట్టించుకున్న నాధుడే లేడన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్లు ఇస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తమ్మలి శ్రీనివాస్, బూరం గణేష్‌యాదవ్, ప్రభాకర్‌గుప్త, మల్లేష్ యాదవ్, ఏకాంబర్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.


సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, మార్చి 12, ప్రభాతవార్త :** సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనలను దశల వారిగా చేపట్టి పూర్తి చేస్తానని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బూర్గుపల్లిలో బుధవారం రాఘవేంద్ర కాలనీలో ఎంజిఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎస్‌డిఎఫ్ ద్వారా రూ.3 లక్షలతో బోర్‌కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 యేండ్లుగా మామ, అల్లుళ్ల నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట దోచుకున్నారు తప్ప ఒరగబెట్టిందేమిలేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లను పెంచిపోషించిందన్నారు. కాంగ్రెస్ సర్కారు గ్రామాల అభివృద్ధియే ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ సర్కారు చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు అకర్షితులై బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్మల యాదగిరి, కలీం, షాబుద్దీన్, ముద్దం లక్ష్మీ, మంద పాండు,కేదరి సదాశివరెడ్డి, రేణుకా, నర్సింలు, బోదాసు యాదగిరి, సందీప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న హరికృష్ణ


బసవేశ్వర మందిరంలో రేణుకాచార్యుల జయంతిని జరుపుకుంటున్న భక్తులు

## ఘనంగా జగద్గురు రేణుకా చార్యుల జయంతి వేడుకలు

**సదాశివపేట, మార్చి 12, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీమహాత్మ విశ్వగురు బసవేశ్వర ఆలయంలో జగద్గురు శ్రీ రేణుక చార్యుల జయంతి వేడుకలను వీరశైవ లింగాయత్ సమాజ్ ఎడ్లబజార్ ప్రధానకార్యదర్శి సింధూరికేరి వినోద్, కోశాధికారి అరాధి రాచన్నల ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో ఘనంగా బుధవారం జరుపుకున్నారు. జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన జగద్గురు శ్రీరేణుక చార్యుల చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వమించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహఖ అధ్యక్షులు అనిమిశెట్టి జయప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షులు వీరు మహేందర్, రవికుమార్, సురేష్, విశ్వనాథ్, నాగు, వైద్యనాథ్, ప్రవీణ కుమార్, శేఖర్, అంజప్ప, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానించిన బిజెపి నేతలు

**పుల్‌కల్, మార్చి 12, ప్రభాతవార్త:** పట్టభద్రులు ఎమ్మెల్సీగా విజయం సాధించిన చిన్నమైల్ అంజిరెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో కలసి మొదటిమారు మండలానికి చేరుకోవడంతో బిజెపి నాయకులు అంజిరెడ్డి దంపతులను ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి మిఠాయిలతో నోటిని తీపి చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంనతరావు కులకర్ణి, జిల్లా ఉపాధ్యఓఉలు ఏ వెంకనరసింహారెడ్డి, మండల నాయకులు నవీన్‌కుమార్, జయరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**గజ్వేల్, మార్చి 12 (ప్రభాతవార్త):** ప్రభుత్వ వైద్యంపై సర్కార్ ప్రత్యేక దృష్టి సారిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నివాసంలో పలువురు లబ్దిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపుతో పేదలనుండి సంతోషం వ్యక్తం అవుతుందని, సిఎంఆర్ఎఫ్‌తో పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు రోగులకు మౌలిక వసతుల కల్పనపై మంత్రి దామోదర రాజ నర్సింహ దృష్టి సారించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సుకేందర్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు కరుణాకర్‌రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్‌గౌడ్, మైనార్టీ నాయకులు అజ్జర్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జగ్గయ్యగారి శేఖర్, దప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులకు పరీక్షా సామాగ్రీ అందజేత

**చిన్నశంకరంపేట, మార్చి 12,ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని బిఆర్ఎస్ నాయకుడు స్వామి అన్నారు. బుధవారం చందంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆకులపల్ల దుర్గయ్య సేవలు అభినందనీయం

**పాపన్నపేట, మార్చి 12, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు ఆకులపల్లి దుర్గయ్య సేవలు అభినందనీయమని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు కొనియాడారు. పాపన్నపేటలోని మంజీర గార్డెన్స్‌లో టేక్మాల్ పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కుసంగి ఎంపిపిఎ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు ఆకులపల్లి దుర్గయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా అభినంద సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఆర్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్,మెదక్ ఎంఈఓ నీలకంఠం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అమరేందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అశోక, మెదక్ పిఆర్‌టియు అధ్యక్షులు సుంకరి క్రిష్ణ, ప్రధానకార్యదర్శి సామ్య నాయక్, మాజీ అధ్యక్షులు టి రాందాస్, సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంఈఓ వీర్‌సంగప్ప, హవేలి ఘనపూర్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఎస్ సత్యనారాయణ, మాజీ డిప్యూటీ డిఈఓ సుధాకర్, టేక్మాల్ మండల నాయకులు సుబేదార్ మాన్ కిషన్, నిమ్మ రమేష్, ముక్తార్, మండల పిఆర్‌టియు అధ్యక్షులు ఎండి అమీరోద్దీన్, శంకర్‌రావు హాజరై దుర్గయ్యను సన్మానించి అందించిన సేవలను కొనియాడారు.


ఆకులపల్లి దుర్గయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు


అమ్మవార్లకు పూజలు చేసిన వాల్దాస్ మల్లేష్‌గౌడ్, నాయకులు

## భక్తిశ్రద్దలతో దేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**నర్సాపూర్, మార్చి 12. ప్రభాతవార్త :** మండలపరిధిలోని చిన్నచింతకుంట గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ, దుర్గామాత విగ్రహాల ప్రతిష్టా మహోత్సవాలు భక్తి శ్రద్దలతో నియమనిష్టలతో జరిగాయి. మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రతిష్ట మహోత్సవాలు జరగగా బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్,నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రేణుక ఎల్లమ్మ, దుర్గామాతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి ఆలయాలను నిర్మించి దేవతల విగ్రహాలను ప్రతిష్టించడం అబినందనీయమన్నారు. ఈ సందర్భంగా వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌తోపాటు బిజెపి నాయకులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బాదె బాలరాజు, ఓబీసీ మోర్చ జిల్లా ఉపా అధ్యక్షులు గుండం శంకర్, నర్సాపూర్ పట్టణ ఉపాధ్యక్షులు సంగసాని రాజు, దళిత మోర్చ జిల్లా ఉపా అధ్యక్షులు శబార్దిగిరి,నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నగేష్, శివంపేట్ మండల ప్రధాన కార్యదర్శి సాధుల అశోక్,నర్సాపూర్ మండల ప్రధానకార్యదర్శి నగేష్‌గౌడ్, శ్రీకాంత్‌చారి, నర్సాపూర్ పట్టణ సీనియర్ నాయకులు సదానంద్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**సదాశివపేట, మార్చి 12, ప్రభాతవార్త:** రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు గొర్రెిళ్ల ప్రభాకర్ కుమార్తె వివాహ వేడుకలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్, పట్టణ కార్యదర్శి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## ఏపి మాజీ సిఎం జగన్‌కు వివాహపత్రిక అందజేత


వైఎస్ జగన్ కు వివాహ పత్రికను అందిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, మార్చి 12,ప్రభాతవార్త:** సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డి వివాహం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వివాహ పత్రికను పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అందజేశారు. విజయవాడ తాడేపల్లిలో గల ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వివాహ ఆహ్వానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు హర్షణీయం

**చిన్నశంకరంపేట,మార్చి 12,ప్రభాతవార్త:** యంగ్ ఇండియా ఇంటిగ్రెటేడ్ స్కూల్స్ నిర్మాణం హర్షనీయం అని కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్, రాజ్‌కుమార్‌గౌడ్, ఉదయ్ కుమార్‌లు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్లతో 25 ఏకరాలలో రామాయంపేటలో నిర్మించాలని తిసుకున్న నిర్ణయం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్స్ నిర్మాణానికి ఒకటేరోజు 11వేల కోట్ల రుపాయలు విడుదల చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పాలనలో మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని మెదక్‌లో అంతర్జాతీయ స్కూల్స్‌కు నిధులు తేవడం మంచి పరిణామమన్నారు. ఇందుకు కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల దాహార్తికి చలివేంద్రం ఎంతో ఉపయోగం

**చిన్నశంకరంపేట, మార్చి 12,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ మన్నన్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణ్,రాజేశ్వర్, నరేష్‌గౌడ్,శ్రీమన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకోం

### గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో వాల్మీకి బోయలను ఎస్‌టి జాబితాలో కలపాలని మాట్లాడిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణ వైఖరిని తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక తమ రాజకీయ లాభం కోసం ఆదిలాబాద్ మాజీ ఎంపి సోయం బాపూరావు ద్వార గిరిజన తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టిందని మళ్లీ ఇప్పుడు బోయ వాల్మీకిలకు గిరిజనులకు మధ్య చిచ్చుపెట్టాలని చూడడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులు ఎదగకుండా చేస్తున్న ఒక కుట్రలో భాగమే ఈరోజు పార్లమెంట్ సభ్యురాలి మాటలు అని అర్థమౌతుందన్నారు. వాల్మీకి బోయలను ఎస్టిలలో కలిపే ప్రయత్నం చేస్తే రెండు తెలుగు రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

**హుస్నాబాద్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో మొక్క కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం నాయకులు, బిఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ అన్నారు.బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌తోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కజొన్న పంట రైతుల చేతికి వచ్చిందని, ఇప్పటి వరకు కొరుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరలకు విక్రయించుకుంటూ గిట్టుబాటు ధరను పొందలేక ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.ఇప్పటికైనా హుస్నాబాద్‌లో మొక్కజొన్న కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను నష్టపోకుండా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు

**సిద్దిపేట రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం తెలంగాణ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ ఎ.అరవింద్‌కుమార్, డాక్టర్ రమలు విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. దంత, నోటి ఆరోగ్యంనో స్మోకింగ్ డేపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మనిషి ఆరోగ్యంలో దంత ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. చికిత్సలు అవరపమైన విద్యార్థులను సిద్దిపేటకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వామి, కలకిరణ్, గోవర్ధన్, శ్రీనివాస్, సరిత, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు


కొమురవెల్లిలో పోలీసు అదుపులో ఉన్న మాజీ సర్పంచ్‌లు

**కొమురవెల్లి, మార్చి 12, ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మాజీ సర్పంచ్‌లు ఛలో అసెంబ్లీకి పిలుపునివ్వడంలో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు మండల పరిధిలోని మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు స్వామిగౌడ్, కర్ణాకర్‌లు మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి నగ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

## టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్‌ను కలిసిన నేతలు


తలకొక్కుల రాజుకు పుష్పగుచ్చం అందజేస్తున్న పద్మశాలిసంఘం నేతలు

**గజ్వేల్, మార్చి 12 (ప్రభాతవార్త):** తెలంగాణ ఆర్చరీ, టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజును గజ్వేల్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు సబ్బని చంద్రవరౌళి, శేర్ల నర్సింలు, పెండెం వెంకటేష్, మెరుగు శ్రీనివాస్, ఏదెల్లి విష్ణువర్ధన్ బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని, పలు ప్రభుత్వ పాఠశాలల్లో తన సొంత ఖర్చులతో లైబ్రరీలను ఏర్పాటు చేయించారన్నారు. సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజును కలువడం సంతోషంగా ఉందన్నారు.

## మొక్కలు నాటిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు


మొక్కను నాటుతున్న రాజేశ్వర్‌రావు, మేఘనారాణి

**గజ్వేల్, మార్చి 12 (ప్రభాతవార్త):** గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి పక్కన తన నివాసం వద్ద బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెప్యాల రాజేశ్వర్‌రావు ఆయన సతీమణి మేఘనారాణితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల భావితరాలకు ఆరోగ్యంతో పాటు పచ్చదనం ఇస్తుందన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**కొల్చారం, మార్చి 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంసాన్‌పల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ ఆవరణలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గ్రామస్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీని ఎవరితో పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ గౌస్, కళాబృందం ఇన్‌ఛార్జి, హెడ్ కానిస్టేబుల్ సురేందర్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతునన ఎస్ఐ మహమ్మద్ గౌస్

# బిజెపి బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

**గజ్వేల్, మార్చి 12 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాలకు విశ్వగురువుగా పేరొందిన నరేంద్రమోడి దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సారథ్యంలో రానున్న రోజుల్లో రాష్ట్రంలో బిజెపి జెండా ఎగరడం ఖాయమన్నారు. పేదల సంక్షేమం కోసమే నరేంద్రమోడి పనిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలువంచి సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చేస్తామన్నారు. గత బిఆర్ఎస్‌పాలనలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో పాలన కొనసాగిస్తూ వారి సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షునిగా తనపై నమ్మకంతో నియమించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మెదక్ ఎంపి రఘునందన్‌రావులకు రుణపడివుంటా నన్నారు. బిజెపి బలోపేతం కోసం ప్రతి ఒక్క కార్యకర్త నడుం బిగించి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షునిగా బైరి శంకర్ మొదటిసారిగా గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా నాయకులు నాగు ముదిరాజ్, మనోహర్‌యాదవ్‌లు గజమాలవేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జమిలి ఎన్నికల జిల్లా కన్వీనర్ నలగామ శ్రీనివాస్, కో-కన్వీనర్ వెంకటేష్, బిజెపి రాష్ట్ర నాయకులు జశ్వంత్‌రెడ్డి, పేర్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, ఉప్పల మధుసూదన్, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు బండారు మహేష్, పెంద్యాల శ్రీని వాస్, రేగొండ, బారు అరవింద్, మహిళా మోర్చా నాయకులు సుమతి, వినోద, భాగ్యలక్ష్మి, మమత పాల్గొన్నారు.


బిజెపి జిల్లా అధ్యక్షున్ని గజమాలతో సన్మానిస్తున్న మనోహర్‌యాదవ్, నాగు ముదిరాజ్ తదితరులు

## గురుకుల్ విద్యాలయను అభివృద్ధి చేయండి



ఉత్తరాలు వేస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రమేశ్‌గుప్త

**ఘట్‌కేసర్, మార్చి 12, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ గురుకుల్ విద్యాలయను అభివృద్ధి చేయాలని కోరుతూ పూర్వవిద్యార్థులు ఉత్తరాల ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో సీఎం, మంత్రులకు ఉత్తరాలను వేస్తున్నారు. బుధవారం గురుకుల్ పూర్వవిద్యార్థి, ఆర్యవైశ్య సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బెలిదె రమేశ్‌గుప్త ఘట్‌కేసర్ తపాలా కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు, దేవాదాయశాఖ కమీషనర్‌లకు స్పీడ్‌పోస్ట్ ద్వారా ఉత్తరాలను వేశారు. ఈకార్యక్రమంలో కంది ప్రేమ్‌కుమార్, కొత్త కొండ వెంకటేశ్, తల్లం కోటేశ్వరరావు, బచ్చు నాగేశ్‌గుప్త, సత్యనారాయణ, బూరుగు చంద్రశేఖర్‌గుప్త, పి.చంద్రశేఖర్, వీరేశ్, విశ్వనాథం, శరత్, కేఫా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు వచ్చేనా..నిరుద్యోగ సమస్య తీరేనా..



అనువుగా ఉన్న ప్రభుత్వ భూమి

**మర్పల్లి, మార్చి 12, ప్రభాతవార్త:**
మర్పల్లి మండల కేంద్రంలో స్మాల్ ఇండస్ట్రీ ఫ్యాక్టరీ పరిశ్రమలు ఏర్పాటు చేసి మండలంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పలువురు నాయకులు పలుసార్లు హామీలు ఇచ్చిన అవి నేటికి నెరవేరలేదు. మర్పల్లి మండలం కర్ణాటక సరిహద్దు మండలం కావడంతో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ సమస్య అధికంగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీ స్పీకర్ గడం ప్రసాద్‌కుమార్ మర్పల్లి మండలవాసులు కావడంతో ఈసారైన పరిశ్రమలు వచ్చేనా అని మండలవాసులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల ఒకసమావేశంలో మర్పల్లి మండల కేంద్రంలో ఇండస్ట్రియల్ పార్కు స్థాపించి 2000వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించడంతో మండల నిరుద్యోగుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. గతంలో మండలంలోని ఘనాపూర్ గ్రామంలో పరిశ్రలు స్థాపించడం కొసం సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని పలు సార్లు సర్వేలు నిర్వహించి నివేదికలు పంపారు అయిన అమలుకు నోచుకోలేదు. మర్పల్లి మండలంలోని ఘనాపూర్,సిరిపూరం,మర్పల్లి,కల్‌ఖోడా, గ్రామాల్లో పరిశ్రమలకు సరిపోయే ప్రభుత్వ భూమి ఉండడంతో ఇక్కడ పరిశ్రమాలు స్థాపించడం సులువుగా అవుతుందని పలువురు అంటున్నారు.

## యాదవులు అన్నిరంగాల్లో రాణించాలి

**-వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్యయాదవ్**



అఖిలభారత యాదవ సంఘం నూతన కమిటీ సభ్యులు

**దుద్యాల్, మార్చి 12, ప్రభాతవార్త:**
యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్ అన్నారు. బుధవారం దుద్యాల మండలంలోని చిల్ముల్ మైలారం గ్రామంలో అఖిలభారత యాదవ మహాసభ సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు. అధ్యక్షుడుగా గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నర్సిములు యాదవ్, ఉపాధ్యక్షులుగా రవి యాదవ్, నరేష్ యాదవ్, కోశాధికారిగా మొగులయ్య యాదవ్, కార్యదర్శులుగా శ్రీనివాస్ యాదవ్, మొగులయ్య యాదవ్, గౌరవ అధ్యక్షుడుగా వెంకటయ్య యాదవ్, ఇతర కమిటీసభ్యుల ం ఎ న్నుకున్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, యాదవులు రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాఘవేందర్ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మన్నే బస్వరాజ్ యాదవ్, మండలాల అధ్యక్షులు కే. నర్సిములు యాదవ్, రామకృష్ణ యాదవ్, బి.నర్సింహ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులు నర్సిములు యాదవ్, ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**దుద్యాల్, మార్చి 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు చదివి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ముస్తాక్ పటేల్ పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల కోసం రైటింగ్ పాడ్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ రామారావు, ఉపాధ్యాయులు రాములు, రవీందర్ గౌడ్, మల్లప్ప పాల్గొన్నారు.

## ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

**-స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి మధుసూదన్‌రెడ్డి**




మాట్లాడుతున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి మధుసూదన్‌రెడ్డి

**మేడ్చల్, మార్చి 12. ప్రభాతవార్త:**
ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం కల్పించిన రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి మధుసూదన్ రెడ్డి కోరారు. మేడ్చల్ పట్టణంలోని జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లపై బుధవారం అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఐజి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2020 సంవత్సరంకంటే ముందు ఎల్ఆర్ఎస్ కోసం ధరఖాస్తు చేసుకున్నవారికి 25శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. అనాథరైజడ్ లేఔట్లలో అమ్ముకుండా మిగిలిపోయిన ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేసుకుని అమ్ముకునే విధంగా ప్రభుత్వం మరలా అవకాశం కల్పించిందని వివరించారు. ఎల్ఆర్ఎస్ చేయించుకోవడంతో దస్తావేజుల విలువ పెరుగుతుందని అన్నారు. అనంతరం ప్రజలకు డాక్యుమెంట్ రైటర్లకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ డిస్టిక్ రిజిస్టర్ సిహెచ్ అశోక్ కుమార్. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ లెక్కలు తేల్చండే, ఉద్యోగ నియామకాలు వద్దు

**మొయినాబాద్ ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్‌మాదిగ**

**మొయినాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్‌ల ప్రక్రియ జనాభా దశ ప్రకారం వాటా లెక్క తేల్చందే ఉద్యోగ ఫలితాలు, నియామకాలుచేపట్టొద్దని, ఎమార్పీఎస్ వ్యవస్థాపకులు, మందక్రిష్ణమాదిగ పిలుపు మేరకు రెండవరోజు రిలేనిరాహారదీక్షలను, మండల అధ్య క్షుడు కొండిగారి మహేందర్‌మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ తెలంగాణరాష్ట్రంలో మందక్రిష్ణమాదిగ గత 30ఏళ్ళ పోరాటఫలితంతో దేశ అత్యున్నత న్యాయ స్థానం రాష్ట్రాలు చేసుకోవచ్చని వెసులుబాటును కల్పించిన కొద్దిగంటల్లోనే తెలంగాణరాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీసాక్షిగా దేశంలో అందరి కంటే ముందుగా వర్గీకరణచేస్తామని, వర్గీకరణ ప్రక్రియ పూర్తి అయేంతవరకు ఉద్యోగనియామ కాలు నిలిపివేస్తామని హామీయిచ్చారని గుర్తుచేశా రు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చినమాటను తప్పి, గ్రూప్1 ఫలితాలను విడుదల చేశారని, వెంటనే నియమకాల ప్రక్రియ ఆపాలని, లేదంటే మాదిగల ఆగ్రహాన్ని కాంగ్రెస్‌పార్టీ, ముఖ్య మంత్రి ఎదుర్కోవాల్సి వస్తుందని, గుర్తుచేశారు. కార్యక్ర మంలో మండల ఉపాధ్యక్షులు దార్గుపల్లి రాజు మాదిగ, సీనియర్‌నాయకులు బోడభిక్షపతిమాదిగ, బోడ పెద్దభాస్కర్‌మాదిగ, కనగళ్ళ క్రిష్ణ మాదిగ, మాటూరి ఏసురత్నంమాదిగ, కనకమామిడి, అధ్యక్షులునరేందర్,రామగళ్ళకుమార్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే



నరేష్‌గౌడ్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న నరేందర్‌రెడ్డి తదితరులు

**దుద్యాల్, మార్చి 12, ప్రభాతవార్త:**
కొడంగల్ నియోజకవర్గ బిఆరెస్‌పార్టీ యువనాయకుడు నరేష్‌గౌడ్, అఖిల దంపతులకు పండంటి ఆడబిడ్డ జన్మించిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కోస్గిలోని విజేత హాస్పటల్‌లో నరేష్‌గౌడ్, అఖిల దంప తులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడబిడ్డ పుట్టడం పూర్వజన్మ సుకృతమని, అదృష్టంగా భావించాలన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మధుయాదవ్, కోట్ల మహిపాల్, సోమనాథ్ తదితరులు ఉన్నారు.

## బిజెపితోనే గ్రామాల అభివృద్ధి



సిసిరోడ్ పనుల ం ప్రారంభిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి

**ధారూరు, మార్చి 12, ప్రభాతవార్త:**
బిజెపితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బిజెపి జిల్లా అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామంలో రూ.5లక్షల ఎంపినిధులతోవేస్తున్న సిసిరోడ్ పనుల ం ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, సీనియర్ నాయకులు పాండుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు వివేకానందరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, మాజీ మండలాధ్యక్షులు రమేష్, గ్రామపెద్దలు రాజేందర్‌రెడ్డి, బిసి మోర్చ జిల్లా నాయకులు శ్రీకాంత్, అర్జున్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గొరిగే మల్లేశం, పామెన్ సంజీవ్‌రెడ్డి, గోరిగే శ్రీశైలం, బంటు సాయిలు, ప్రవీణ్, కావాలి మల్లయ్య, పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికసేవలో ఇఫ్తార్‌విందు ఓభాగం

**-బిఆర్ఎస్ నేతలు**

**షాద్‌నగర్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త:**
మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్‌మాసం నిలుస్తుందని, ఐకమత్యంతో అందరుకలిసి ఈరంజాన్‌మాసాన్ని ఘనంగాజరుపుకోవడం ఇక్కడి అనవాయితీ అని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, యువనేత కేశంపేట మాజీఎంపీపీ రవీందర్ యాదవ్‌లు అన్నారు. బుధవవారం షాద్‌నగర్ చౌరస్తాలోని మజీదులో బీఆర్ఎస్‌నాయకుడు పల్లెశ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత రవీందర్‌యాదవ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ముస్లింలతోకలిసి ఇఫ్తార్‌విందులో భాగస్వామ్యమయ్యారు. ఈసంద ర్భంగా వారుమాట్లాడుతూ... ముస్లింసోదరుల పవిత్రమాసమైన రంజాన్ ఉప వాసాలను పురస్కరించుకొని, మతాలకతీతంగా ఇఫ్తార్‌విందులను ఏర్పాటు చేయడం సామాజికసేవలో ఒకభాగమని అన్నారు.
కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచులు మోబిన్ ఘోరీ, అశోక్, మచ్చేందర్, రంగయ్య గౌడ్, చందు నాయక్, చంద్రశేఖర్, రంగయ్య, సాయి యాదవ్, మాజీ కౌన్సిలర్లు చింటూ, వెంకట్రాంరెడ్డి, జూపల్లి శంకర్, నాయకులు వీరేశం గుప్తా, నక్కల వెంకటేష్ గౌడ్, రఘుపతి రెడ్డి, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), బిలాల్, పర్వేజ్, అజహర్, సాధక్, చిలకమర్రి ఆనంద్, మహబూబ్, రహమత్ అలీ, అబ్బాస్, మినాజ్ తదితరులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరవేయాలి

**ఘట్‌కేసర్, మార్చి 12, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన పేదలకు అందించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని టిపిసిసి మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సామ రాంమోహన్‌రెడ్డి సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బొక్కోనిగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొక్క సత్తిరెడ్డి బుధవారం రాంమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రభుత్వపథకాలను ప్రజలలోకి తీసుకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐకార్యకర్తలు కాంగ్రెస్‌పథకాలపై విస్తృత ప్రచారంచేసి అర్హులులబ్ధిపొందేవిధంగా చొరవచూపాలని ఆయన పేర్కొన్నారు.

## గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**-డిపిఓ జయసుధ**



గ్రామాల్లో సందర్శిస్తున్న డిపిఓ డాక్టర్ జయసుధ

**ధారూరు, మార్చి 12, ప్రభాతవార్త:**
గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ అన్నారు. బుధవారం మండలపరిధిలోని చింతకుంట, కేరల్లి గ్రామాల్లో గ్రామాల ం సందర్శించారు. గ్రామాల్లో నర్సరీ, కంపోస్ట్ షెడ్, వైకుంఠ దామం, పారిశుధ్యం తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామపంచాయతీ రికార్డుల ం ఎప్పటికప్పుడు నమోదు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు 100 శాతం ప న్ను వసూలు కానీ గ్రామపంచాయతీలు త్వరగా ప న్ను వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీఓకు సూచించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమెతోపాటు మండల పంచాయతీ అధికారితో షఫీ ఉల్లాఖాన్, కార్యదర్శి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ చట్టాలపై డీలర్లకు అవగాహన అవసరం

**-జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి

**కొడంగల్, మార్చి 12, ప్రభాతవార్త:**
వ్యవసాయ చట్టాలపై డీలర్లకు అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌మండలంలోని పర్సా పూర్ రైతువేదికలో నిర్వహించిన డివిజన్ స్థాయి అవగాహన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ డీలర్లు రానున్న వర్షాకాల సీజన్‌కు సంబంధించి పండించే పంటలకు సంబంధించి రైతాంగానికి నాణ్యతతోకూడిన విత్తనాలు అమ్మాలని అన్నారు. రైతులు నష్టపోకుండా నకిలీవిత ్తనాల బారినపడకుండా డీలర్లు సహకరించాలని సూచించారు. ఎరువులు,విత్తనాలకు సంబంధించి అమ్మకాలకు సంబంధించిన బిల్లులు కొనుగోలుచేసిన రైతులకు విధిగా ఇవ్వాలని, ఎంఆర్‌పి రేట్లకంటే ఎక్కువ అమ్మకూడదని, లేబుల్‌లేకుండా అమ్మకూడదని సూచించారు. కార్యక్రమంలో మండలవ్యవసాయఅధికారులు జి.తులసి,హిమబిందు, వ్యవసాయవిస్తరణ అధికారులు రాజురాథోడ్, అశ్వినిలతోపాటు కొడంగల్, బొంరాస్‌పేట్,దౌల్తాబాద్,దుద్యాల మండలాలకుచెందిన డీలర్లు పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీలపై ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నట్లు సీపీఎం మండలకార్యదర్శి ఎన్.సబిత తెలిపారు. పోచారం మున్సిపల్ రాజీవ్ గృహకల్పకాలనీలో రాష్ట్రప్రభుత్వంప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీలు గ్యాస్‌సబ్సిడీ, ఉచితకరెంటు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, కొత్తపెన్షన్లు తదితర అంశాలపై బుధవారం ఇంటింటికితిరిగి ప్రజాభిప్రాయం సేకరించినట్లు తెలిపారు. ఎన్‌టీపీసీనుండి రాజీవ్‌గృహకల్పకాలనీకి వచ్చేదారిలో వీధిదీపాలు, డ్రైనేజీ, దోమలు తదితర సమస్యలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కార నిమిత్తం ప్రభుత్వ అధికారులకు విన్నవిస్తామని తెలిపారు. ఇంటింటి సర్వే కార్యక్రమంలో సీపీఎంనాయకులు చింతలయాదయ్య, చల్లగొండఅరుణ, బి.సునీత, కె.అలివేలు, పద్మ, శోభ, లావణ్య, చంద్రకళ, సరసమ్మ, విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత కుటుంబాన్ని పరామర్శించిన షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే

**షాద్‌నగర్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త:**
జోగులాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పల పూర్ణచందర్‌రావు సతీమణి భారతి అనారోగ్యంతో మృతిచెందారు. ఈవిషయం తెలిసిన షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, షాద్‌నగర్‌కు చెందిన పాతూరి వెంకట్‌రావు, పినపాక ప్రభాకర్, పాతూరి బ్రహ్మయ్య, గూడె వసంతరావు, మొక్కపాటి మల్లేశ్వర్‌రావు, బండారుపల్లి నాగేశ్వర్‌రావు, సంజీవరావులు బుధవారం భారతికి నివాళులర్పించారు.

# కొడంగల్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఆలయ ధ్వజస్తంభం

**కొడంగల్, మార్చి 12, ప్రభాతవార్త:**
పేదలపెన్నిధిగా పేరుగాంచి రెండో తిరుపతిగా వెలుగొందుతూ భక్తుల ఇలవేల్పుగా వెలిసిన కొడం గల్ శ్రీమహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి 45వవార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగు తున్నాయి. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలను తలపించేతీరులో టిటిడి అర్చకుల పర్యవేక్షణలో ఈనెల 24నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 3వ తేదివరకు 10రోజులపాటు భక్తుల గోవిందనామస్మరణతో మారుమ్రోగుతూ అంగరంగ వైభవంగాకొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల్లో రోజుకో వాహనంపై శ్రీవారు ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. తిరుపతి వెళ్ళేందుకు ఆర్థికస్తోమత లేని భక్తులకు ఇదోక వరం. భక్తుని కోరికమేరకు ఏడుకొండలు దిగివచ్చి కొడంగల్‌లో కొలువుదీరిన శ్రీమహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆల యం రెండో తిరుపతి పుణ్యక్షేత్రంగా విరాజిల్లు తుంది. ప్రసిద్ధిగాంచిన అనేక ఆలయాలు ఆదరణకు నోచుకోక శిథిలావస్థలో ఉంటే వాటితో సరితూగేఆలయాన్ని నూతనంగానిర్మించడం దేవుని పై ఒభక్తుడికి ఉన్న అపారమైన భక్తికి నిదర్శనం. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలను తలపించే మాదిరిగా టిటిడి అర్చకబృందం ఆధ్వర్యంలో నిర్వ హించడం ఇక్కడిప్రత్యేకత. ఉత్సవాలకు హైద్రా బాద్, రంగారెడ్డి, కర్నాటకలోని గుల్బర్గ, యాద్గీర్, రాయిచూర్, షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు అధికసంఖ్యలోపాల్గొని తమతమ మొక్కు లను తీర్చుకుంటారు.

**ఆలయంలో ప్రతిష్ఠించిన మూలవిరాట్...**
తిరుమల తిరుపతి దేవస్థానంలో మాదిరిగానే ఇక్కడి ఆలయంలో ప్రతిష్ఠించిన మూలవిరాట్‌ను చూసిన భక్తులు స్వయంగా ఏడుకొండలపై కొలువు దీరిన వేంకటేశ్వరసా ్వమిని చూసినంత అనుభూతికి లోనవుతారు. ఆలయంలో నిత్యం పూజాకార్య క్రమాలు జరుగుతునే ఉంటాయి.

## యువత స్వశక్తితో ముందుకుసాగాలి

**కీసర, మార్చి 12, ప్రభాతవార్త:**
యువత స్వశక్తితో ముందుకుసాగాలని మేడ్చల్ మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాగారంమున్సి పాలిటీపరిధిలోని రాంపల్లిచౌరస్తాలో పిస్తాహోటల్ ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ యువకులు ఉద్యోగాలకోసం ఎదురు చూడకుండా ఇలా వ్యాపారాలుపెట్టుకుని ముందుకుసాగాలన్నారు. ఈకార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే వెంకటస్వామి, మున్సిపల్ మాజీచైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఘణపురం కొండల్‌రెడ్డి, చిన్నంరాజు సాయినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌ని సద్వినియోగం చేసుకోవాలి

**కీసర, మార్చి 12, ప్రభాతవార్త:**
నిరుపేదలు సిఎం రిలీఫ్ ఫండ్‌ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం గోదుమకుంట గ్రామానికి చెందిన వంగేటి నారాయణరెడ్డి 33వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యురాలు తాండూరి సంధ్య దశరథ గౌడ్ పాల్గొన్నారు.

## టియుడబ్ల్యుజె (ఐజెయు) కమిటీని రద్దుచేయాలి

**-టియుడబ్ల్యుజె సీనియర్ జర్నలిస్టులు రఘుపతి, గణేష్**

**రంగారెడ్డి జిల్లా అర్బన్, హైదరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:**
మాజీ మంత్రి పీఆర్‌వోను టియుడబ్ల్యుజె (ఐజెయూ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సిగ్గుచేటని జిల్లా టియుడబ్ల్యుజె నూతన కమిటీనిపున:పరిశీలించి వెంటనేరద్దుచేయాలని టియుడబ్ల్యుజె సీనియర్ జర్నలిస్టులు రఘుపతి, గణేష్‌లు సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యుజె సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో సీనియర్ జర్నలిస్టు రఘుపతి మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లిలో జరిగిన టీయూడబ్ల్యుజే రంగారెడ్డి జిల్లా మహాసభ ఏకపక్షంగా నియంతృత్వ పోకడలతో జరిగిందని విమర్శించారు. ఒకే వర్గానికి పెద్దపీట వేస్తూ ఒక ప్రాంతానికి, మరికొంత మంది అనుచరులకు పదవులుకట్టబెడుతూ అన్యాయంగా వ్యవహరించా రని ఆరోపించారు. ఓ బిఆర్ఎస్ మాజీమంత్రి పీఆర్‌వో సలీంను నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సిగ్గుచేటన్నారు. ఎంతోమంది జర్నలిస్టులు దీనిని వ్యతిరేకిస్తున్నారని అన్నారు.
శంకర్‌పల్లిలో జరిగిన టియుడబ్ల్యుజె (ఐజెయూ) రంగారెడ్డి జిల్లా మహాసభను తాము గుర్తించడంలేదని సీనియర్ జర్నలిస్టు గణేష్ వ్యాఖ్యానించారు. కేవలం పదవి, మార్పు ఎజెండాతో సభను నిర్వహిం చారని విమర్శలు గుప్పించారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలకు మహాసభ ద్వారా ప్రజా ప్రతినిధులు వచ్చి ఉంటే పరిష్కారం దొరికేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో దిశ సురేష్, చంద్రశేఖర్, రాచల్లపల్లి నర్సింహ్మా, దరువుల శంకర్, కృష్ణ, తిరుపతయ్య, తూర్పు శ్రీను, మహేష్, జనార్దన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హక్కులు, సాధికారతకు కృషి చేయాలి

**ఘట్‌కేసర్, మార్చి 12, ప్రభాతవార్త:**
మహిళాసాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షురాలు ఉప్పల శారద అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పటేల్‌నగర్ లోని ఆర్యవైశ్యశ్రీవాసవీ కళ్యాణమండపంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళావిభాగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై వినోధభరితమైన పోటీలు నిర్వ హించారు. జేసీఐ అధ్యక్షురాలు డాక్టర్ అమితాశర్మ, అంభికలు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ మహిళాహక్కులు, సాధికారతపై అవ గాహన కల్పించారు. వివిధ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. ఈసందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాచం సుష్మ, అదనపు ప్రధాన కార్యదర్శి నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షురాలు బచ్చు మమత ప్రమోద్, ప్రధానకార్యదర్శి బచ్చు సరిత విజయ్, కోశాధికారి పోల చందన విశ్వనాథం, సభ్యత్వ కమిటీ చైర్‌పర్సన్ శిరీష, కార్య నిర్వాహణాధికారి మేఘమాలతోపాటు జిల్లాలోని 14మండలాల మహిళ లు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు ఎంతో న్యాయం జరుగుతుందని, పేదలకు లబ్ధి చేకూరుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో మంజూరైన 2 ఇండ్లకు సంబంధించి బుధవారం లాంఛనంగా భూమిపూజ చేశారు. సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల కృషి ఎంతో ఉంది. ఏ ప్రభుత్వము అధికారంలో ఉన్నా జర్నలిస్టులతోనే నిరుపేదలు పడుతున్న కష్టాలు ప్రభుత్వాలకు తెలుస్తాయని, నిరుపేదలకు ఇండ్లు రావడంలో జర్నలిస్టుల కృషి ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు పూజ చేస్తున్న క్రమంలో మెయిన్ స్ట్రీమ్ మీడియా అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ, రాజేష్, ఎండి అఫ్సర్‌కు మహిళలతో హారతులు ఇచ్చి ఆహ్వానించారు. త్వరలోనే జర్నలిస్టులకు కూడా ఇళ్లస్థలాలసమస్య సాకారం అవుతుందని సూచనప్రాయంగా తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బన్సీలాల్, తదితర అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

## మహిళాస్ఫూర్తి అవార్డు అందుకున్న గాయని వెంకటమ్మ

**యాచారం, మార్చి 12, ప్రభాతవార్త:**
మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రీన్ ఇండియన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ జిరామిరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన మహిళాస్ఫూర్తి అవార్డు గ్రహీతల కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన జానపద గాయని దార వెంకటమ్మ అవార్డు అందుకున్నారు. జానపదకళారంగంలోచేస్తున్న విశిష్టమైనసేవలు గుర్తించి గ్రీన్ ఇండియన్ సొసైటీ చైర్మన్ జ్యోతిరెడ్డి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళ ప్రతి ఇంటిని పచ్చదనంగా మార్చాలని ప్లాస్టిక్‌ని నివారించాలని నీటిని పొదుపుగా వాడుకోవాలని పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయా లని జ్యోతిరెడ్డి తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**ధారూరు, మార్చి 12, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గురుదోట్లగ్రామంలో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద బుధవారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం, గురుదోట్ల గ్రామానికి చెందిన కొంకలి బాలమణి గ్రామంలో నివాసముంటూ పశువులనుకాస్తూ జీవనం కొనసాగిస్తు న్నది. ఈక్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు మేతమేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు మృతిని తెలుసుకున్న బాలమణి సంఘటన స్థలానికి చేరుకుని భోరున విలపించింది. మృతిచెందిన ఎద్దు విలువ రూ.60వేల వరకు ఉంటుందని తెలిపింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది.